

అందని ద్రాక్షే..!

ద్రాక్ష సాగుకు పూర్వవైభవం కలగానే మిగిలింది. ఉద్యానవనశాఖ అమలు చేయాలనుకున్న ప్రణాళిక ముందుకు సాగడం లేదు.

వివరాలు 8లో ▸



ఆది మానవుడి ఆనవాళ్లు

కొల్చారం మండలంలోని పాత శివాలయం గుట్ట మీద నవీన రాతియుగం ఆనవాళ్లు వెలుగు చూశాయి.

వివరాలు 8లో ▸



జోరుగా ఆస్పత్రి పనులు

కంకోల్ గ్రామ సమీపంలో 30 పడకల ఆస్పత్రి పనులు జోరందుకున్నాయి. దీంతో మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

అటవీ భూమి ఆక్రమిస్తే చర్యలే

సంగారెడ్డి అటవీ అధికారి దేవీలాల్



అక్రమంగా వేసిన షెడ్లను కూల్చివేసిన అటవీ శాఖ అధికారులు

హత్నూర(సంగారెడ్డి): అటవీ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి అటవీశాఖ రేంజ్ అధికారి దేవీలాల్ స్పష్టం చేశారు. హత్నూర మండలం షేర్‌ఖాన్‌పల్లి గ్రామ శివారులోని పలుగుమీది నల్ల పోచమ్మ ఆలయం సమీపంలో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న సుమారు 30 దుకాణాలు తొలగించినట్లు ఆయన గురువారం మీడియాకు వెల్లడించారు. అక్రమంగా షెడ్లు వేసుకున్న వారికి గతంలో ఇచ్చిన నోటీసులకు స్పందించకపోవడంతోనే వాటిని తొలగించినట్లు వివరించారు. ఈ రేకుల షెడ్ల తొలగింపులో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ షాహిని, సంగారెడ్డి, గుమ్మడిదల సెక్షన్ అధికారులు వేణుగోపాల్ ,హుస్సేన్, బీట్ అధికారులు విజయ్, శ్రీకాంత్, రత్న పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్




హాస్టల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేశ్

సంగారెడ్డి టౌన్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేశ్ పేర్కొన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను గురువారం పట్టణంలోని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని హాస్టల్ అధికారులకు తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు జిల్లా విద్యార్థులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయిలో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో సంగారెడ్డి జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనక్‌లో సంగారెడ్డి జిల్లా నుంచి నాలుగు ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపిక కాగా, బాల వైజ్ఞానిక ప్రదర్శనలో రెండు దక్షిణ భారతదేశ స్థాయికి ఎంపికయ్యాయి. జిల్లా నుంచి మొత్తం ఆరు అవార్డ్స్ అందుకున్నారు. కాగా, జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులకు సంబంధించిన విద్యార్థులను, గైడ్ టీచర్‌లను కలెక్టర్ క్రాంతి వల్లూరు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, జిల్లా సైన్స్ అధికారి పి.సిద్ధారెడ్డి, కో– ఆర్డినేటర్ వెంకట రమణాచార్యులు అభినందించారు. ఈ మేరకు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు గురువారం మీడియాకు వివరాలు వెల్లడించారు.

ట్రస్మా రాష్ట్ర కార్యదర్శిగా పటేల్ ప్రభు



సదాశివపేట(సంగారెడ్డి): ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం(ట్రస్మా) రాష్ట్ర కార్యదర్శిగా సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని శాంతినికేతన్ విద్యాలయం కరస్పాండెంట్ మాలి పటేల్ ప్రభు నియమితులయ్యారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ట్రస్మా రాష్ట్ర కార్యదర్శిగా అవకాశం కల్పించిన గౌరవ అధ్యక్షుడు యాదగిరి, శేఖర్‌రావు, లింగాగౌడ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి అంతోని రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

12న మెదక్ కలెక్టరేట్‌లో యువజనోత్సవాలు

మెదక్ కలెక్టరేట్: ఈనెల 12వ తేదీన కలెక్టరేట్‌లో జాతీయ యువజన దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి నాగరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని యువజన సంఘాల నాయకులు, క్రీడాకారులు, పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

9.66 లక్షల టన్నుల చెరుకు క్రషింగ్

- 9.51లక్షల క్వింటాళ్ల మేర చక్కెర ఉత్పత్తి
- రెండు కర్మాగారాల్లో క్రషింగ్ పూర్తి
- రూ.198.55 కోట్ల మేర రైతులకు చెరుకు బిల్లుల చెల్లింపు



కర్మాగారానికి క్రషింగ్ నిమిత్తం తరలించేందుకు చెరుకును లోడింగ్ చేస్తున్న కూలీలు

జహీరాబాద్: రాష్ట్రంలోని చక్కెర కర్మాగారాల్లో చెరుకు క్రషింగ్ ఊపందుకుంది. ఇప్పటికే నిర్ధారించిన లక్ష్యంలో సగానికి పైగా క్రషింగ్ నిర్వహించాయి. రాష్ట్రంలో ఉన్న ఏడు చక్కెర కర్మాగారాలు 2024–25 క్రషింగ్ సీజన్‌కు గాను 16.81 లక్షల టన్నుల మేర చెరుకును క్రషింగ్ నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఇప్పటివరకు ఆయా కర్మాగారాలు 9.66లక్షల టన్నుల మేర చెరుకు పంట క్రషింగ్ నిర్వహించాయి. ఇంకా 7.14లక్షల టన్నుల మేరకు చెరుకును గానుగాడించాల్సి ఉంది. రాష్ట్రంలో 16.81లక్షల టన్నుల మేర చెరుకు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉన్నట్లు కేన్ అధికారులు అంచనా వేసి, అందుకు అనుగుణంగా ఆయా కర్మాగారాలకు క్రషింగ్ లక్ష్యాన్ని నిర్దేశించాయి.

ఇప్పటివరకు 9.51లక్షల క్వింటాళ్ల చక్కెర

ఇప్పటికే సగానికి పైగా చెరుకు పంట క్రషింగ్ జరిగింది. ఆయా కర్మాగారాలు కలిపి మొత్తం 18.65 లక్షల క్వింటాళ్ల చక్కెరను ఉత్పత్తి చేయనున్నాయని నిర్ధారించగా, ఇప్పటివరకు 9.51లక్షల క్వింటాళ్ల మేర చక్కెర ఉత్పత్తి చేశాయి. 9.84 శాతం మేర సగటు చక్కెర రికవరీ వచ్చింది. రైతులు కర్మాగారాలకు చెరుకును సరఫరా చేసిన పక్షం రోజుల్లో బిల్లులను చెల్లించాలనే నిబంధన ఉంది. అందుకు అనుగుణంగా యాజమాన్యాలు బిల్లులు చెల్లిస్తున్నట్లు కేన్ అధికారులు పేర్కొంటున్నారు. 31 డిసెంబర్ వరకు రూ.343.99 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉండగా డిసెంబరు నెలాఖరు నాటికి రూ.198.55 కోట్ల మేర రైతులకు చెల్లించినట్లు కేన్ అధికార వర్గాలు వివరించాయి. బిల్లుల చెల్లింపులు 57.72 శాతం మేర ఉంది. ఈ ఏడాది రాష్ట్రంలో 7 చక్కెర కర్మాగారాలు క్రషింగ్‌ను ప్రారభించాయి. ఇప్పటికే కాకతీయ షుగర్స్, మధుకాన్ షుగర్స్ కర్మాగారాలు క్రషింగ్‌ను ముగించాయి.

ఫ్యాక్టరీల వారీగా...

కాకతీయ షుగర్స్ కర్మాగారం 48వేల టన్నుల చెరుకును, మధుకాన్ షుగర్స్ 58వేల టన్నుల చెరకును క్రషింగ్ నిర్వహించాయి. సంగారెడ్డిలోని గణపతి చక్కెర కర్మాగారం 4.50లక్షల టన్నుల మేర చెరుకు క్రషింగ్ నిర్వహించాలని లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటివరకు 2.15లక్షల టన్నుల మేర చెరకును క్రషింగ్ నిర్వహించింది. ఈ సీజన్‌కు గాను క్రషింగ్‌ను ప్రారంభించిన రాయికోడ్‌లోని గోదావరి గంగా చక్కెర కర్మాగారం 2లక్షల టన్నుల చెరుకు క్రషింగ్ జరపాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు 52వేల టన్నుల మేర చెరుకును క్రషింగ్ నిర్వహించింది. కామారెడ్డిలోని గాయత్రి షుగర్స్ 3.25లక్షల టన్నుల మేర క్రషింగ్ జరపాలని నిర్ణయించగా, ఇప్పటివరకు 1.94లక్షల టన్నుల మేర చెరుకును క్రషింగ్ జరిపింది. నిజాంసాగర్‌లోని గాయత్రి షుగర్స్ కర్మాగారం 3.75లక్షల టన్నుల మేర చెరుకు క్రషింగ్ నిర్వహించనుందని అంచనా వేయగా ఇప్పటివరకు 2.23లక్షల టన్నుల మేర క్రషింగ్ జరిపింది. కొత్తకోటలోని క్రిష్ణవేణి షుగర్స్ కర్మాగారం 2.25లక్షల టన్నుల చెరుకు పంటను క్రషింగ్ నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 1.77లక్షల టన్నుల మేర చెరుకు క్రషింగ్ నిర్వహించింది.

పెరిగిన పంటల రుణస్థాయి

- వరి పంట ఎకరాకు రూ.52 వేలు
- డీఎల్‌టీసీ నిర్ణయం
- పంటల రుణస్థాయి 12% పెంపు
- రానున్న ఆర్థిక ఏడాది నుంచి అమలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రానున్న ఆర్థిక ఏడాది 2025–26లో పంట రుణాలకు సంబంధించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను సుమారు 10 నుంచి 12 శాతం వరకు పెంచాలని జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ (డీఎల్‌టీసీ) సూత్రప్రాయంగా నిర్ణయించింది. వరికి ఇచ్చే పంట రుణాన్ని ఎకరానికి రూ. ఏడు వేల చొప్పున పెంచనున్నారు. ఇప్పటివరకు నీటి పారుదల సౌకర్యం ఉన్న భూముల్లో సాగు చేసే వరి పంట ఎకరాకు రూ.43 వేల నుంచి రూ.45 వేల చొప్పున బ్యాంకులు రుణాలిచ్చేవి. ఇకపై ఈ పంటకు కనీసం రూ.49 నుంచి రూ.52 వేలకు పెంచాలనే డీఎల్‌టీసీ నిర్ణయించింది. మెదక్, సిద్దిపేట



జిల్లాల పరిధిలో అన్ని పంటల కంటే వరి ఎక్కువ గా సాగవుతుంది. ఈ రెండు జిల్లాలతో పోల్చితే సంగారెడ్డిలో వరి కాస్త తక్కువ విస్తీర్ణంలో వేసుకుంటారు.

సాగు ఖర్చులు..దిగుబడుల ఆధారంగా..

ఆయా పంటల సాగుకు ఎకరాకు అయ్యే ఖర్చులు, ఎకరానికి వచ్చే సగటు దిగుబడులు, రైతు సొంత అవసరాలకు పోగా విక్రయించే పంట పరిమాణం తదితర అంశాలను లెక్కించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను నిర్ణయిస్తారు. కూలీల ఖర్చులు, పెరిగిన ఎరువులు, విత్తనాల ధరలతో సాగు వ్యయం ఏటా భారీగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కాస్త ఎక్కువగా పెరిగితేనే రైతుల అవసరాలకు తగ్గట్టుగా రుణం దొరుకుతుంది.

ఊరెళ్తున్నారా.. జర భద్రం

సమాచారమిస్తే నిఘా పెడ్తాం: పోలీసులు

సంగారెడ్డి క్రైమ్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో నగరం నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే వారు సమాచారమిస్తే వారి ఇంటిపై నిఘా ఉంచుతామని పోలీసులు సూచిస్తున్నారు. ప్రజలు ఇళ్లల్లో లేని సమయం చూసుకుని నేరస్తులు దొంగతనాలకు పాల్పడే అవకాశముందని అలాంటి పోలీసులు హెచ్చరిస్తున్నారు. చోరీల నివారణకు రాత్రివేళల్లో గస్తీని కూడా పెంచామని పట్టణ సీఐ రమేశ్ గురువారం మీడియాకు వివరించారు. ఎవరైనా ఊరు వెళ్లే పరిస్థితుల్లో దొంగతనాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఇంటి చిరునామా, ఫోన్ నంబర్‌ను స్థానిక పోలీసు స్టేషన్‌లో ఇస్తే వారి ఇంటిపై నిఘా ఉంచుతామని



సీఐ రమేశ్

వివరించారు. సీసీ కెమెరాలు అమర్చుకుని వాటి సెక్యూరిటీ ద్వారా ఇంటర్నెట్ అనుసంధానం ఉన్న మొబైల్ నుంచి తమ పరిసరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవాలని సూచించారు. బంగారం, వెండి ఇతర విలువైన వస్తువులు ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకరులో భద్రపరుచుకోవాలని సూచించారు. సొంతూళ్లకు, విహార యాత్రలకు వెళ్లే వారు తమ పర్యటన వివరాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవద్దని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తుల గురించి డయల్ 100 లేదా స్థానిక పోలీస్‌స్టేషన్ సమాచారం ఇవ్వాలి అని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే 96% పూర్తి

- ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు
- ఇళ్ల నిర్మాణానికి నమూనా రూపకల్పన
- తుది దశలో ఇంటింటి సర్వే
- లబ్ధిదారుల ఎంపికపై కలెక్టర్ సమీక్ష

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని వారికి ఇందిరమ్మ పథకం పేరుతో ఇళ్లు మంజూరు చేయనుంది. అందుకుగాను ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి అర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. అధికారులు దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి అర్హులైన వారిని గుర్తించేందుకు చేపట్టిన సర్వే తుది దశకు చేరుకుంది.

ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా సర్వే...

ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు గతంలో ప్రభుత్వం ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరించారు. వాటి ఆధారంగానే గ్రామాలలో సర్వే చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో 2,56,625, పట్టణ ప్రాంతాలలో 62,150 మొత్తం 3,18,775 దరఖాస్తులు వచ్చాయి. అందులో ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో 2,44,573, మున్సిపాలిటీలలో 59,814 దరఖాస్తుల సర్వే పూర్తి చేశారు. ప్రస్తుతం జిల్లాలో 96 శాతం సర్వేను పూర్తి చేశారు. సర్వేను పూర్తి చేసేందుకు ఎప్పటికప్పుడు జిల్లా అధికారులు నివేదికలను పరిశీలించి, సర్వేలో వేగం పెంచారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొన్ని రోజులుగా దరఖాస్తు చేసుకున్న వారి ఇంటి వద్దకే వెళ్లి వివరాలు సేకరించి, యాప్‌లో నమోదు చేసే ప్రక్రియ చేపట్టారు. దరఖాస్తుదారు వివరాలతో పాటు యాప్‌లోని అన్ని వివరాలను సేకరించి, నమోదు చేశారు.



ఇందిరమ్మ ఇంటి నమూనా

నియోజకవర్గానికి 3,500 ఇళ్లు

రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇల్లు మంజూరు చేయనుంది. మొదటి విడతలో ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేయనున్నారు. అర్హులైన నిరుపేదలకు ఖాళీ స్థలం ఉన్న వారికి మంజూరు చేయనున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఇక గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నమూనా రూపొందించింది. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నమూనా ఇంటి పనులను ప్రారంభించారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు అందించనుంది.

సర్వేపై సూపర్ చెక్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు జిల్లాలో సూపర్ చెక్‌ను నిర్వహిస్తున్నారు. మండలాల్లో సంబంధిత ఎంపీడీవోలు, మున్సిపాలిటీలలో సంబంధిత కమిషనర్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ప్రతీ గ్రామం, వార్డులలో 10 సర్వే పూర్తి అయినవి సరైన విధంగా ఉన్నాయో లేదో తెలుసుకుంటారు. ఏవైనా తప్పులుంటే సవరణలు చేయనున్నారు.

> **రెండు, మూడు రోజుల్లో సర్వే పూర్తి**
>
> జిల్లాలో ఇప్పటి వరకు 96 శాతానికి పైగా సర్వే పూర్తి అయ్యింది. మరో రెండు, మూడు రోజుల్లో సర్వే పూర్తి చేయటం జరుగుతుంది. ఎలాంటి తప్పులు లేకుండా సర్వేను నిరంతరం పర్యవేక్షించటం జరుగుతుంది.
>
> –చంద్రశేఖర్, అదనపు కలెక్టర్, సంగారెడ్డి



‘గణతంత్ర’కు పకడ్బందీ ఏర్పాట్లు

అధికారులకు కలెక్టర్ క్రాంతి ఆదేశం

సంగారెడ్డి జోన్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురిలతో కలసి వివిధ శాఖల అధికారులతో గురువారం గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...గణతంత్ర దినోత్సవానికి జరిగే పరేడ్ కోసం అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు శాఖకు సూచించారు. దేశభక్తి గీతాలతో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. వేదిక మార్గాలను పరిశుభ్రంగా ఉంచడం, తాగు నీటి సౌకర్యం వంటి అంశాలపై దృష్టిపెట్టాలన్నారు. వివిధ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను తెలిపే శకటాల ప్రదర్శనలతో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు.



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ క్రాంతి వల్లూరు

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

2025–26 విద్యా సంవత్సరంలో వివిధ గురుకులాల్లో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాల కోసం ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 23న కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించనుందని కలెక్టర్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు జ్టి ఇటః//జచ్ఛి.ఛిజజ.జౌఠి.జీ ఽద్వారా ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 1వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలకు, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీ సీట్లలో ప్రవేశాల కోసం గడువులోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

కార్మికుల భద్రతకు ప్రాధాన్యత

పరిశ్రమలకు అనుమతులిచ్చే ముందు, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను సమర్పించాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు స్పష్టం చేశారు. పరిశ్రమలలో కార్మికుల భద్రతకు అత్యంత ప్రాముఖ్యత ఇవ్వాలని, కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. పరిశ్రమలలో ప్రమాదాల నివారణకు తరచూ తనిఖీలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఆర్‌వో పద్మజ రాణి, పోలీస్ శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తుల్జా నాయక్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి అఖిలేశ్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

● ‘ముక్కోటి’ శోభితం



ముక్కోటి ఏకాదశి సందర్భంగా సంగారెడ్డి వైకుంఠపురం దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. రంగురంగుల విద్యుద్దీపాలతో ఆలయం దేదీప్యమానంగా వెలిగిపోయింది. భక్తులకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. మహిళలు ఉదయం నుంచే సేవా కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి పూలదండలు సిద్ధం చేశారు. – సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

వ్యాపారంలో సంక్రాంతి ఏది?

కొనుగోళ్లు లేక వెలవెలబోతున్న మార్కెట్లు

- విలవిల్లాడుతున్న వ్యాపారులు
- కనిపించని క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి జోష్
- ఇంత గడ్డు పరిస్థితి ఎన్నడూ లేదంటున్న వ్యాపారులు

సదాశివపేట(సంగారెడ్డి): క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండుగల నేపథ్యంలో కొనుగోలుదారులతో నెల రోజుల పాటు కళకళలాడే మార్కెట్లు ఈ ఏడాది కొనుగోళ్లు లేక వెలవెలబోతున్నాయి. మార్కెట్లో పండుగ జోష్ అస్సలు కనిపించడం లేదు. పండుగల పేరుతో వినియోగదారులకు భారీగా ఆఫర్లు ప్రకటిస్తున్నా కొనుగోళ్లు మాత్రం అంతంతమాత్రంగానే ఉండటంతో వ్యాపారులు విలవిల్లాడుతున్నారు. ఇప్పటికే క్రిస్మస్ అమ్మకాలు సగానికి పైగా పడిపోగా న్యూఇయర్ అమ్మకాలకు అదే పరిస్థితి నెలకొంది.

ముంబై, ఢిల్లీ, కోల్‌కతా నుంచి సరుకు...

క్రిస్మస్ మొదలుకుని సంక్రాంతి పండుగ వరకు వస్త్ర, కిరాణ, బంగారం వ్యాపారాలు భారీగా జరుగుతాయి. ఈ పండుగల కోసం నెల రోజులు ముందుగానే వ్యాపారులు ముంబై,కోల్‌కతా, ఢిల్లీ, హైదరాబాద్ ఇతర ప్రాంతాల నుంచి భారీ మొత్తంలో సరుకు తెచ్చుకుంటారు. చిన్న వ్యాపారులు సైతం రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు సరుకు కొనుగోలు చేసి దుకాణాల్లో పెడతారు. జిల్లాలో సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, పటాన్‌చెరు, జోగిపేట, రామచంద్రాపూర్ తదితర పట్టణాలు వస్త్ర, బంగారం వ్యాపారానికి ప్రసిద్ధి. గతంలో రోజుకు జిల్లాలో సగటున రూ.4 కోట్ల వరకు వస్త్ర వ్యాపారాలు జరిగితే, రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకు బంగారం, కిరాణ వ్యాపారం జరిగేది. క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి రోజుల్లో వీటికి రెట్టింపు స్థాయిలో వ్యాపారం జరిగేది.



సదాశివపేట పట్టణంలో కొనుగోలుదారులు లేక ఖాళీగా ఉన్న రెడీమేడ్ వస్త్ర దుకాణం

పేద, మధ్యతరగతి వద్ద డబ్బుల్లేక...

రోజు రోజుకు పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలు, కూరగాయలు ప్రజల జీవన ప్రమాణాలను మరింత దిగజార్చాయి. కుటుంబ పోషణ కోసం అప్పులు కూడా చేయాల్సిన దుస్థితులు ఏర్పడ్డాయి. దీంతో పేద, మధ్య తరగతి ప్రజల వద్ద కొనుగోళ్లు చేసేంత స్థాయిలో డబ్బులు లేకపోవడంతోనే ఈ ఏడాది మార్కెట్లు కళావిహీనంగా కనిపిస్తున్నాయి. గతంలో ఎప్పుడూ ఇలాంటి గడ్డు పరిస్థితి చూడలేదని వ్యాపారులు వాపోతున్నారు. సంక్రాంతి పండుగపైనే ఆశలు పెట్టుకున్నారు.

పడిపోయిన వస్త్ర వ్యాపారం



ఈ ఏడాది వస్త్ర వ్యాపారం బాగా పడిపోయింది. అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగిపోవడంతో ప్రజల్లో కొనుగోలు స్థాయి పడిపోయింది. యువతీ యువకులు ఆన్‌లైన్ షాపింగ్‌కు అలవాటు పడటంతో షోరూమ్ విక్రయాలు కూడా తగ్గుముఖం పట్టాయి.

–మహావీర్, వస్త్ర వ్యాపారుల సంఘం అధ్యక్షుడు

సంక్రాంతి పండుగపైనే ఆశలు



కోవిడ్ సమయంలో కూడా ఇంత గడ్డు పరిస్థితిని చూడలేదు. ప్రతీ రోజు రూ.10 వేలు వ్యాపారం జరిగేది. ఇప్పుడు రూ.2 వేల నుంచి 3 వేలే. సంక్రాంతి పెద్ద పండుగ కావడంతో వ్యాపారులు ఆశలు పెట్టుకున్నారు.

–శ్రావణ్‌కుమార్, రెడీమేడ్ వస్త్ర వ్యాపారి సదాశివపేట

క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేటరూరల్: సిద్దిపేట ఫుట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 12,13,14వ తేదీల్లో నిర్వహించే ఇంటర్ డిస్ట్రిక్ట్ స్కూల్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోస్టర్‌ను గురువారం అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఆవిష్కరించారు. అనంతరం సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కోచ్ అక్బర్ నవాబ్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే టోర్నమెంట్‌లో దాదాపు పాఠశాలల నుంచి 20 జట్లు పాల్గొననున్నాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ హరీశ్, జాయింట్ సెక్రటరీ సాజిద్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



యాదగిరి(ఫైల్)

నర్సాపూర్ రూరల్: అప్పుల బాధతో వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని తుజాల్‌పూర్‌లో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. నర్సాపూర్ ఎస్సై లింగం కథనం మేరకు.. తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన గొట్టిముక్ల యాదగిరి (52) పౌల్ట్రీ ఫారమ్ షెడ్ నిర్మాణం కోసం చేసిన అప్పులతోపాటు తండ్రి పేరు మీద ఉన్న భూమిని తన పేరు మీద చేయలేదని మనస్తాపానికి గురై ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అంతర్రాష్ట్ర స్మగ్లర్ అరెస్టు



ఆరీఫ్‌ఖాన్‌ను చూపుతున్న పోలీసులు

జహీరాబాద్ టౌన్: ఐదేళ్ల నుంచి తప్పించుకొని తిరుగుతున్న అంతర్రాష్ట్ర స్మగ్లర్‌ను అరెస్టు చేసి గురువారం కోర్టులో రిమాండ్ చేశామని ఎక్సైజ్ ఎస్‌ఐ రమేశ్ తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర థార్ జిల్లాకు చెందిన ఆరీఫ్ ఖాన్ అక్రమంగా మద్యం రవాణా చేస్తుంటాడని, ఇతడిపై హైదరాబాద్‌లోని చేవెళ్ల, శంషాబాద్, కుత్బుల్లాపూర్ తదితర స్టేషన్‌లలో కేసులు ఉన్నాయన్నారు. 2016 సంవత్సరంలో 4 లోడ్ల ఎన్‌డీపీఎల్ మద్యాన్ని రాష్ట్రానికి తీసుకొస్తుండగా ఆయనపై పీడీ యాక్టు నమోదు చేయడం జరిగిందన్నారు. 2014-15 సంవత్సరంలో ఇతడిపై జహీరాబాద్‌లో కూడా కేసు నమోదైందన్నారు. అప్పటి నుంచి తప్పించుకొని తిరుగుతూ గోవాలో ఉన్నట్లు సమాచారం మేరకు అక్కడి వెళ్లి ఆరీఫ్‌ను అరెస్టు చేశామన్నారు. ఈ మేరకు జహీరాబాద్ కోర్టులో రిమాండ్ చేశామని ఆయన వివరించారు.

ఆలయ అభివృద్ధికి కృషి



నల్లపోచమ్మ ఆలయ నూతన పాలకమండలి

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం షేర్‌ఖాన్‌పల్లి గ్రామ శివారులోని పలుగు మీది నల్లపోచమ్మ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నూతన చైర్మన్ మల్లాగౌడ్ అన్నారు. గురువారం ఆలయ ప్రాంగణంలో ఈఓ దేవదానం నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు. నూతన పాలకవర్గం చైర్మన్‌గా మల్లాగౌడ్, ధర్మకర్తలుగా దశరథ్, లక్ష్మణ్‌గౌడ్, శంకరయ్య, స్వరూపస్వామి, శ్రీకాంత్ దేవస్థాన అర్చకుడు ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం దేవనాదం, గ్రామ నాయకులు ఉన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అందని ద్రాక్షే..!



కనుమరుగైన సాగు
- గతంలో హబ్‌గా ఉమ్మడి మెదక్ జిల్లా
- ప్రభుత్వ సహకారం కొరవడి భిన్నమైన పరిస్థితులు
- స్థానిక అవసరాలకు పొరుగు రాష్ట్రాల సరుకే దిక్కు
- సాగు పెంపు కార్యాచరణ ముందుకు సాగకపోవడం వల్లే ఈ దుస్థితి



గజ్వేల్ ప్రాంతంలో ద్రాక్ష సాగు (ఫైల్)

ద్రాక్ష సాగుకు పూర్వవైభవం కలగానే మిగిలింది. రాష్ట్రంలో ఒకప్పుడు ద్రాక్షకు హబ్‌గా ఉన్న ఉమ్మడి మెదక్‌తోపాటు పలు జిల్లాల్లో రైతులను ప్రోత్సహించేందుకు ఉద్యానవనశాఖ రెండేళ్ల కిందట అమలు చేయాలనుకున్న ప్రణాళిక ముందుకు సాగడం లేదు. ఫలితంగా సాగు కనుమరుగై స్థానిక అవసరాలకు పొరుగు రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తున్నది. ఈ వ్యవహారంపై కథనం..

గజ్వేల్: తెలంగాణలో ద్రాక్ష సాగుకు సంబంధించి ఒకప్పుడు ఉమ్మడి మెదక్ జిల్లాతోపాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలు హబ్‌గా ఉండేవి. ఆయా జిల్లాల్లో మొత్తంగా ఏటా 50 వేల ఎకరాలకుపైగా తోటలు సాగులోకి వచ్చేవి. ప్రత్యేకించి ఉమ్మడి మెదక్ జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గం ద్రాక్ష సాగులో సింహభాగాన్ని ఆక్రమించేది. విదేశాలకు ఎగుమతి చేసేందుకు దోహదపడే సీడ్‌లెస్ థామ్సన్, తాజ్ గణేశ్ రకాలే ఇక్కడి రైతులు ప్రధానంగా సాగు చేసేవారు. విదేశాలకే కాకుండా ఇక్కడి నుంచి కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు కూడా ద్రాక్ష ఎగుమతయ్యేది. కానీ పెట్టుబడుల భారం, తెగుళ్లతో జరిగే భారీ నష్టాల కారణంగా తీవ్రంగా నష్టాలు చవిచూడటంతో పాటు ప్రభుత్వ సహకారం కూడా కరువై రైతులంతా ఈ తోటల సాగుకు దూరమయ్యారు. ఫలితంగా సాగు పూర్తిగా కనుమరుగైంది.

మహారాష్ట్ర సరుకే దిక్కు...

ప్రస్తుతం మన రాష్ట్ర అవసరాలకు మహారాష్ట్ర నుంచి ద్రాక్షను దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అక్కడ జనవరి మొదటి వారం నుండి తోటలు కోతకు వస్తుంటాయి. తెలంగాణ జిల్లాల్లో ఫిబ్రవరి చివరి వారంలో తోటలు కోతకు వస్తాయి. కానీ సాగు లేని కారణంగా మహారాష్ట్ర సరుకుపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకవేళ ఇక్కడ అడపాదడపా థామ్సన్, తాజ్‌గణేష్ రకాలు సాగుచేసినా అవి గోళీల మాదిరిగా గుండ్రంగా ఉంటాయి. కానీ మహారాష్ట్రలో సూపర్ సొనాక, మానిక్‌చమన్ లాంటి రకాలు చిటికన వేలు ఆకారంలో ఉండి మార్కెట్‌లో వినియోగదారులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. వీటి దెబ్బకు ఇక్కడ ఉత్పత్తి చేస్తున్న కొద్దిపాటి సరుకును కూడా కొనేవారు లేకుండా పోయారు.

ముందుకుసాగని కార్యాచరణ

ఒకప్పుడు ద్రాక్ష సాగుకు సంబంధించి హబ్‌గా వర్ధిల్లిన ఉమ్మడి మెదక్‌తోపాటు ఇతర జిల్లాల్లోనూ కనుమరుగయ్యే పరిస్థితి రావడంతో ఏళ్ల కిందట అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉద్యానవన శాఖ, ములుగులోని కొండాలక్ష్మణ్ బాపూజీ ఉద్యానవర్సిటీ అధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ అమలుచేయడానికి నిర్ణయించారు. ఈ క్రమంలోనే అప్పట్లో ములుగు యూనివర్శిటీ పరిధిలోని రాజేంద్రనగర్‌లోని ఉద్యానవన కళాశాలలో మేధోమథన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సాగుపై తగ్గడానికి గల కారణాలపై సుదీర్ఘంగా చర్చించారు. హైదరాబాద్‌కు సమీపంలోని ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లాలోని భూములన్నీ రియల్ వ్యాపారం కారణంగా బడా బాబులు చేతులకు వెళ్లిపోవడం, ద్రాక్ష సాగుకు కూలీలు సమస్యగా మారటం, పెట్టుబడి లక్షల్లో ఉండటం, ఎరువులు, క్రిమిసంహారకాల నిర్వహణ కష్టతరంగా మారటం వంటి కారణాల వల్ల సాగు పడిపోయి... ప్రస్తుతం కనురమరగయ్యే పరిస్థితి వచ్చిందని గుర్తించారు. తెలంగాణలో వేలాది ఎకరాల్లో సాగు రాష్ట్రం మొత్తంగా చూస్తే కేవలం కొద్ది ఎకరాల్లోనే ఉన్నదని కూడా నిర్ధారించారు. ఈ క్రమంలోనే ఏటా కనీసం వెయ్యి ఎకరాలు కొత్తగా ద్రాక్ష సాగు పెరిగేలా ఏం చేయాలనే అంశంపైన కూడా పలు నిర్ణయాలు తీసుకున్నారు. ప్రస్తుతం ద్రాక్షలో టేబుల్, జ్యూసీ, వైన్ అనే మూడు రకాలుంటాయి. ఇందులో ఒక్కో వెరైటీలో ఎన్నో కొత్త వంగడాలు వచ్చాయి. ఈ రకాలపై రైతులకు అవగాహన కల్పించి ఈ నేలలకు అనుకూలమైన రకాలను ఎంచుకొని సాగు చేసేలా ప్రోత్సహించాలని నిర్ణయించారు.

ఒకప్పుడు ఎన్నో కొత్త వంగడాలు

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: మండలంలోని ఇస్నాపూర్ గ్రామ పరిధిలోని మత్స్యకారుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం అందించడంతో పాటు, మత్స్యకారుల సొసైటీలో నూతన సభ్యత్వానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఇస్నాపూర్ మత్స్యకార సహకార సంఘం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇరిగేషన్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇస్నాపూర్ గ్రామ పరిధిలోని వివిధ చెరువులు మత్స్యకార సహకార సంఘంలో నూతన సభ్యత్వం అందించడం గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం సభ్యులు ఎమ్మెల్యే జీఎంఆర్ దృష్టికి తెచ్చారు. గ్రామ పరిధిలోని పెద్ద చెరువు చేపపిల్లల పెంపకానికి అనువుగా లేదని సంబంధిత కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు నివేదిక ఇవ్వడంతో చేప పిల్లలు పంపిణీ చేయడం లేదని మత్స్యశాఖ జిల్లా అధికారి నరసింహారావు ఎమ్మెల్యేకి తెలిపారు. దీంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేపల పెంపకంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు ఆర్థికంగా నష్టపోతారని, పెద్ద చెరువు కాలుష్యంపై సమగ్ర నివేదిక అందించాలని పీసీబీ అధికారి గీతను ఆదేశించారు. పెద్ద చెరువుకు సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సభ్యత్వం అందించాలని అధికారులను సూచించారు. పీసీబీ నివేదిక అనంతరం పెద్ద చెరువు పరిధిలోని పరిశ్రమల ద్వారా మత్స్యకారులందరికీ ప్రతిఏటా నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఇరిగేషన్ డీఈ రామస్వామి, ఇస్నాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రాఘవేందర్, వైస్ ప్రెసిడెంట్ గోపాల్, సలహాదారులు పెంటయ్య, నర్సింలు, రవీందర్, రామచంద్రాపురం ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్లు

జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్: మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో మహిళా సంఘాల సభ్యుల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు గురించి లైన్ డిపార్ట్‌మెంట్ (డీఆర్‌డీఏ, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ, డీఎఫ్‌ఓ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి, డీఎం ట్రెడ్ కో) వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వయం సహాయక మహిళ సంఘాలు సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయుటకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాముఖ్యత ఇస్తుందన్నారు. జిల్లాలో 50 గ్రామ సంఘాల ద్వారా కనీసం 150 ఎకరాలలో మొదటి విడతగా సోలార్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సోలార్ ప్రోగ్రాంలో 150 ఎకరాల ల్యాండ్‌ను గుర్తించడం జరిగిందన్నారు. అందుకు అవసరమైన నిధులు చిన్న సంఘం, గ్రామ సంఘం, మండల సమాఖ్య, జిల్లా సమాఖ్య, సొంత నిధులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిరుపయోగ భూముల వివరాలు తహసీల్దార్ల ద్వారా మహిళా సంఘాల సిబ్బంది తీసుకొని డీఆర్‌డీఏ ద్వారా 18వ తేదీ నాటికిపూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మోతీమాత జాతర పోస్టర్ ఆవిష్కరణ



జాతర పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

జహీరాబాద్ టౌన్: గిరిజనుల జాతరగా ప్రసిద్ధి చెందిన మోతీమాత(మరిగమ్మ) జాతర పోస్టర్‌ను గురువారం కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కేషుసింగ్ రాథోడ్ మాట్లాడుతూ.. మొగుడంపల్లి మండలం ఉప్పరపల్లి తండాలోని మోతీమాత ఉత్సవాలు 12న ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ జాతరకు రాష్ట్రంలోని నలుమూలల నుంచే కాకుండా కర్నాటక, మహారాష్ట్రాల నుంచి 3 లక్షల మంది భక్తులు వస్తారని అన్నారు. ఈ మేరకు ప్రభుత్వ అధికారులు సమీక్ష సమావేశాలు నిర్వహించి ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమలో గౌరవ అధ్యక్షుడిగా కిషన్ పవార్, అధ్యక్షుడిగా కేషుసింగ్ రాథోడ్, ప్రధాన కార్యదర్శిగా పవన్ రాథోడ్, ఉపాధ్యక్షుడు జాదవ్ నారాయణ, టీబీఎస్ ప్రధాన కార్యదర్శి తులసీరాం రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ



సెంటర్‌ను ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం పారిశ్రామికవాడలో నిరుద్యోగ యువతకు నైపుణ్యం ఉపాధి అవకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో దట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను గురువారం ఫౌండర్ విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. బయోలాజికల్ ఈ లిమిటెడ్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా పారిశ్రామికవాడలోని నిరుద్యోగ యువతకు ప్రత్యేక శిక్షణ కల్పిస్తూ వారిలో నైపుణ్యాలను ఉపాధి అవకాశాలను పెంపొందిస్తామన్నారు. ఈ సెంటర్ ద్వారా ఫార్మా టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటి వెల్‌నెస్ డిజిటల్ కమ్యూనికేషన్, రిటైలింగ్ అంశాలలో యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పారిశ్రామికవాడలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

నారాయణఖేడ్: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన నారాయణఖేడ్ మండలం చాప్టా(కె) గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీశైలం కథనం మేరకు.. గ్రామానికి చెందిన మేత్రి ఉమాకాంత్ (29) కొన్నేళ్లుగా మతిస్థిమితం సక్రమంగా లేక రోడ్ల వెంట తిరిగేవాడు. గురువారం గ్రామ సమీపంలోని బావిలో మృతదేహమై కనిపించడంతో స్థానికులు గుర్తించి కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడ్డాడా లేదా దూకాడా అనే దానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

పుల్‌కల్(అందోల్): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పుల్‌కల్ ఎస్‌ఐ క్రాంతికుమార్ కథనం మేరకు.. మినుపూర్ తండాకు చెందిన బానోత్ ప్రకాశ్ (38) 6న పుల్‌కల్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ముదిమాణిక్యం చౌరస్తా వద్ద ఎదురుగా వస్తున్న ఎంఎస్‌ఆర్ స్కూల్‌కు చెందిన బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన బానోత్ ప్రకాశ్‌ను చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా గురువారం మృతి చెందాడు. మృతుడి తండ్రి సంగ్యానాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వృద్ధుడు..



గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన రామచంద్రాపురం పట్టణంలోని కానుకుంట వద్ద గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలోని కానుకుంట షాబాద్ హోటల్ సమీపంలో ఓ వృద్ధుడు పడిపోయి ఉన్నట్లు డయల్ 100కు ఫోన్ వచ్చింది. స్థానిక పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని ఆ వృద్ధుడిని వెంటనే పటాన్‌చెరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు సుమారు 55 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్యలో ఉండొచ్చని పోలీసులు తెలిపారు. మృతిని ఒంటిపై నీలి రంగు షర్టు, నీలి రంగు లుంగి ధరించి ఉన్నాడు. మృతిని విషయంలో చుట్టు పక్కల ఆరా తీయగా మృతుడు కానుకుంటలోని హనుమాన్ ఆలయం వద్ద భిక్షాటన చేస్తూ ఉండేవాడని స్థానికులు పోలీసులకు తెలియజేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు

ప్రజావేదికలో అధికారుల వెల్లడి



ప్రజా వేదికలో అధికారులు

మద్దూరు(హుస్నాబాద్): ఉపాధి హామీలో రూ.లక్షల్లో అక్రమాలు జరిగినట్లు ప్రజావేదికలో అధికారులు తేల్చారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో 23 గ్రామ పంచాయతీలకు గాను 2023-2024 16వ వార్షిక ఏడాదికి సంబంధించి రూ.9.60 కోట్ల పనులపై తనిఖీలు నిర్వహించారు. పని వివరాలు పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశ్యంతో పని ప్రదేశంలోనే పని వివరాలను నేమ్ బోర్డు పై పొందుపర్చి ఏర్పాటు చేయాలి. కానీ ఆవేవి పట్టన్నట్లు అధికారులు నేమ్ బోర్డులు ఏర్పాటు చేయకుండానే సుమారుగా రూ.4,55,000 చెల్లింపులు జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. తొమ్మిది గ్రామాల్లో నేమ్ బోర్డు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పని జరగకపోయినా జరిగినట్లు రికార్డులో నమోదు చేసుకొని మస్టర్‌లో సంతకాలు లేకుండానే నగదు చెల్లింపులు చేసుకున్నారు. తక్కువ పనికి ఎక్కువ చెల్లింపులు జరిగినట్లు అధికారులు తెలిపారు. కూలీలకు పే స్లిప్‌లు అందికపోవడం, ఏడు రకాల రిజిస్టర్లను నిర్వహించకపోవడం ఒకే కుటుంబంలో భార్యాభర్తలకు వేర్వేగా రెండు జాబ్‌కార్డులు ఇచ్చారని ప్రజావేదికలో వీఆర్పీలు వెల్లడించారు. అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకుంటూ రికవరీకి ఆదేశించినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు డీఆర్డీవో బాలకృష్ణ, ఏపీపీ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో రామ్మోహన్, క్యూసీ సంతోష్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

మా అమ్మ మృతిపై అనుమానాలు

- చికిత్స సమయంలోనే మరణం
- కానీ.. డబ్బులు తీసుకునేదాకా వ్యవహారాన్ని దాచారు
- కూతురు ఫిర్యాదు.. మృతదేహానికి రీ పోస్టుమార్టం



పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులు, తహసీల్దార్

రామాయంపేట(మెదక్): తన తల్లి మృతిపై అనుమానం ఉందంటూ ఓ మహిళ హైదరాబాద్‌లో ఫిర్యాదు చేయగా గురువారం మండలంలోని సుతారిపల్లిలో వైద్యులు రీ పోస్టుమార్టం నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని సుతారిపల్లికి చెందిన రాగి చిన్నవాలోల్ల లక్ష్మి (45) నాలుగు నెలల కిందట అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్రమంలో మృతి చెందగా, పోస్టు మార్టం నిర్వహించకుండానే గ్రామంలో దహన సంస్కారాలు నిర్వహించారు. తన తల్లికి చికిత్స చేస్తున్న క్రమంలో మృతి చెందగా, వైద్యులు తనకు సమాచారం ఇవ్వకుండా డబ్బులు తీసుకున్న తర్వాతే మృతి చెందినట్లు చెప్పారని కూతురు ఆరోపించింది. హైదరాబాద్‌లో ఫిర్యాదు చేయడంతో స్థానిక తహసీల్దార్ రజనీకుమారి సమక్షంలో గాంధీ ఆస్పత్రి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు


జోగిపేట(అందోల్): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో అందోల్ జోగిపేట ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీపీ కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీకి వచ్చే నిధుల్లో మొట్టమొదట కార్మికుల జీతాలు ఇవ్వాలని జీలో నంబర్ 60 ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. జీతాలు అడిగితే కార్యదర్శులు బెదిరింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా ఇంతవరకు పెండింగ్ జీతాలు చెల్లించలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అందోల్ జోగిపేట ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ అందోల్ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్, గ్రామపంచాయతీ కార్మికులు మల్లేశం, మహేష్, సాయి, పెంటయ్య, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జైలు

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవలో పట్టుబడ్డ ఆరుగురికి కోర్టు జైలు, జరిమానా విధించిన ఘటన ట్రాఫిక్ సీఐ సుమన్ కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. పట్టణ ట్రాఫిక్ పోలీస్ సిబ్బందితో కలిసి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద బుధవారం అర్ధరాత్రి ప్రత్యేక తనిఖీ నిర్వహించాం. మద్యం సేవించి వాహనం నడుపుతూ ఆరుగురు పట్టుబడ్డారు. వీరిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ఒక్కరికి రెండు రోజులు జైలు శిక్ష, మిగితా ముగ్గురికి రూ.1500, మిగితా ఇద్దరికి రూ.1,000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఆది మానవుడి ఆనవాళ్లు గుర్తింపు





జంతువులను వేటాడడానికి ఉపయోగించిన రాతి పనిముట్టు, పాత శివాలయం గుట్ట

అంసాన్‌పల్లి పాత శివాలయం గుట్ట వద్ద లభ్యం

కొల్చారం(నర్సాపూర్): కొల్చారం మండలం అంసాన్‌పల్లి గ్రామ శివారులోని పాత శివాలయం గుట్ట మీద నవీన రాతియుగం ఆనవాళ్లు వెలుగు చూశాయి. ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు లైబ్రేరియన్ బుర్ర సంతోష్ గురువారం సాక్షితో తన పరిశోధనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆనాటి ఆది మానవులు ఆహార వేటలో భాగంగా ఉపయోగించిన రాతి పనిముట్లు, పదును చేయడానికి నూర్పిన నూరుడు గుంతలు (గ్రూమ్స్) గుర్తించినట్టు తెలిపారు. క్రీస్తు పూర్వం 5 వేల సంవత్సరం కిందట ఆది మానవులు ఇక్కడ నివసించినట్లు ఈ ఆధారాల ద్వారా తెలుస్తుందన్నారు. ఇది వరకే కాజీపల్లి ఉడుము గుట్టలు, జక్కన్నపేట నల్లగుట్ట కుక్కునూరు బండలు, హస్తల్‌పూర్ గుట్టలలో పురాతన మానవుడి ఆనవాళ్లు, అప్పటి ఆదిమానవుల రాతి పెయింటింగ్స్ గుర్తించామని పేర్కొన్నారు.

యథేచ్ఛగా ఇసుక దందా!

- పట్టపగలే ట్రాక్టర్లలో తరలింపు
- అక్రమార్కులకు కాసుల పంట
- నామమాత్రపు జరిమానాలతో సరిపెడుతున్న అధికారులు



పట్టపగలే ట్రాక్టర్లలో ఇసుక రవాణా

చిన్నకోడూరు(సిద్దిపేట): ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఇసుక వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుక దందాను కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సరిహద్దు మండలాలైన బెజ్జంకి, కోహెడ, ఇల్లంతకుంట మండలాల నుంచి వ్యాపారులు ఇసుకను చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాలతోపాటు సిద్దిపేట పట్టణానికి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా నిత్యం వ్యాపారులకు ఇసుక దందా కాసుల వర్షం కురిపిస్తుంది. చట్టం ప్రకారం వాహనాలను జప్తు చేయడంతో పాటు జరిమానా విధించాలి. కానీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసే నాథుడు కరువయ్యారు. ఇసుక రవాణాను అరికట్టాల్సిన అధికారులు వాహనానికి ఇంతా అంటూ మామూళ్లు దండుకుంటున్నారు. అధికారుల హోదాలకు అనుగుణంగా ఇసుక వ్యాపారులు జేబులను తడుపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ తెరచాటు దందాలో కొందరు నాయకులు శక్తి మేర అండదండలు అందిస్తున్నారు. ఈ అక్రమ వ్యాపారంలో కొందరు రాటుదేలి ఈ వ్యాపారాన్ని ఉపాధిగా చేసుకొని దర్జాగా సాగిస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు తనిఖీలు చేసి ఇసుక వాహనాలను స్వాధీనం చేసుకొని నామమాత్రపు జరిమానాలు విధిస్తూ వదిలేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.